ప్రమాదాల నివారణ కృషి చేయాలి

వనపర్తి టౌన్, జనవరి 4 : ట్రాఫిక్ నిబంధలు పాటించడమే కాకుండా రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి ప్రమాదాలు అరికట్టేందుకు కృషి చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించినట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శనివారం మధ్యాహ్నం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, ఎస్పీ, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారన్నారు. రోడ్డు భద్రతపై అత్యంత ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని భద్రత మహోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. నెల రోజులపాటు అన్ని మండలాలు, గ్రామాల్లో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ చెప్పారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పోలీస్, రవాణా శాఖలను ఆదేశించారు. అదేవిధుగా జిల్లావ్యాప్తంగా 49 ప్రదేశాల్లో సైన్ బోర్డులు పెట్టడం జరిగిందని, స్పిడ్ బ్రేకర్స్, ప్రమాదాకర టర్నింగ్ పాయింట్లను తొలంగించేలా పంచాయతీరాజ్ ఇంజినీర్లను ఆదేశించామని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఎస్పీ రావుల గిరిధర్, ఆర్డీవో సుబ్రమణ్యం, డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్టీవో మానస, పీర్ ఈఈ మల్లయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ సీతారామా స్వామి, ఆర్టీసీ డీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందుండాలి

అంధులు సామాన్యులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుండాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సంక్షేమ శాఖ కార్యాలయంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ అంధుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కొత్త లిపి ఆవిర్భవించిందన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో అందులు రాణిస్తున్నారని, అందుకు మన జిల్లాలో ప్రభుత్వ ఉన్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, బ్యాంకు ఉద్యోగి మధు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సీడీపీవో లక్ష్మమ్మ, అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ ధాన్యాన్ని ఇవ్వాలి

2023-24 యాసంగి, 2024-25 వానకాలం సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ ధాన్యాన్ని మిల్లర్లు వెంటనే ఎఫ్‌సీఐకి ఇవ్వాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎంఆర్ ధాన్యంపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని జనవరి 25వ తేదీలోపు అందించాలని ఆదేశించారు. 2024-25 వానకాలం సీజన్‌కు సంబంధించిన సివిల్ సప్లయ్‌కి ఇవ్వాల్సిన సీఎంఆర్ ధాన్యాన్ని కూడా రైస్‌మిల్లర్లు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాథ్, డీఎం రమేశ్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- ప్రారంభమైన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్
- ఆకట్టుకున్న ప్రదర్శనలు

విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

గద్వాలటౌన్, జనవరి 4 : విద్యార్థులు తమకు నచ్చిన రంగంలో రాణించి ఉన్నత స్థాయికి చేరు కోవాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు రెండు రోజులపాటు నిర్వహిస్తున్నారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకించి ప్రదర్శనల వివరాలు, ప్రాముఖ్యతను విద్యార్థుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులను ఆయన అభినందించారు. అంతకుముందు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పాఠశాల నుంచే నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టబడ తాయన్నారు. సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు రావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, డీఈవో అబ్దుల్‌ఘనీలు ప్రదర్శనలు తిలకించారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు..

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 208 ప్రదర్శనలు, 40 ఇన్‌స్పైర్ ప్రయోగాలను ప్రదర్శించారు. విద్యార్థులు తక్కువ ఖర్చుతో బట్టలు ఉతికే వాషింగ్ మిషన్, ఆటోమిటిక్ ఫోర్ క్లీనర్ రోబో, తక్కువ విస్తీర్ణంలో నూతన పద్ధతుల్లో వ్యవసాయం, సమీకృత వ్యవసాయం, భూసార పరిరక్షణ, లైటింగ్ సిస్టమ్, రోడ్డు భద్రతకు సంబంధించి, మహిళల రక్షణ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వర్మికం పోస్టు, ఖాళీ బాటిల్లతో కుటీరం ఏర్పాటు చేయడం వంటి ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు శ్రీనివాసులు, కృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతు, జిల్లా సైన్స్ అధికారి భాస్కర్ పాపన్న, ప్రధానోపాధ్యాయుడు ఇమ్మానియేల్, ఎంఈవో శ్రీనివాస గౌడ్ పాల్గొన్నారు.

ఆటోమెటిక్ ఫ్లోర్ క్లీనర్‌ను ప్రదర్శించిన లింగన్‌వాయి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి సందీప్‌కుమార్

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

వనపర్తి టౌన్, జనవరి 4 : జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ట్రాఫిక్ నిబంధలపై చిన్నారులచే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు సీఐ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలను చేపట్టారు. విద్యార్థులకు ట్రాఫిక్ సింబల్స్ వేషధారణ, హెల్మెట్ వేషాధారణ వేసి అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడంతో ప్రమాదాల నుంచి రక్షణ ఎలా పొందవచ్చో వివరించారు. కార్యక్రమంలో ఎస్సై హరిప్రసాద్, రూరల్ ఎస్సై జలందర్‌రెడ్డి, మామ్స్ విజన్ పాఠశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

కూలీ రేట్లు పెంచాలి

అయిజ, జనవరి 4 : సర్కారుతో కుదిరిన ఒప్పందం ప్రకారం తక్షణమే కూలీ రేట్లు పెంచి హమాలీలకు చెల్లించాలని సీఐటీయూ నాయకుడు సవారి డిమాండ్ చేశారు. అయిజ పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాం వద్ద సివిల్ సప్లయ్ ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో పని చేస్తున్న హమాలీ కార్మికులు డిమాండ్ల పరిష్కారానికి చేపట్టిన సమ్మె శనివారం నాల్గో రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారమే పెంచిన రేట్లను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో భీమన్న, తిరుమలేశ్, వీరేశ్, మౌల, తిమ్మప్ప, మునీంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

అమరచింత, జనవరి 4 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వపు విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, పాఠశాల పూర్వపు విద్యార్థి వెంకటనాథం పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జెడ్పీ పాఠశాలలో చదువుకున్న చాలామంది పూర్వ విద్యార్థులు ఉన్నత స్థానల్లో ఉన్నారని, వారంతా పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం వార్షిక పరీక్షల్లో మొదటి స్థానంలో నిలిచిన ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహకంగా రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్‌సింగ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్ ఆయా సంఘాల నాయకులు అజయ్, రాజన్న, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, అనురాధ, రవికిరణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెబ్బేరు వాసికి అభ్యుదయ రైతు పురస్కారం

పురస్కారం అందుకుంటున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

పెబ్బేరు, జనవరి 4 : పెబ్బేరుకు చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి అభ్యుదయ ఆదర్శ రైతు పురస్కారం లభించింది. విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాల్లో భాగంగా ఏపీలోని గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో శనివారం ఆ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా ఆయన మెమెంటో, ప్రశంసాపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీ లావు కృష్ణదేవరాయలు, పద్మశ్రీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, జనవరి 4 : తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనార్టీ నిరుద్యోగ యువత కోసం 4నెలల ఉచిత ఫౌండేషన్ కోర్సులకు అందించే ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆ సంక్షేమ శాఖ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. గ్రూపు 1, 2, 3, 4, ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ, బ్యాంకింగ్ ఉద్యోగాల ఉచిత శిక్షణకు అర్హులైన మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్, బుద్ధ) నిరుద్యోగ యువత అవసర మైన సర్టిఫికెట్ కాపీలు దరఖాస్తుతో జత చేసి ఈనెల 17వ తేదీలోపు జిల్లా మైనార్టీస్ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. వివరాలకు 085 45232500 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అర్హులైన మైనార్టీ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడం లక్ష్యం

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

చేపల విక్రయం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

అమరచింత, జనవరి 4 : మహిళా సంఘాల సభ్యులకు సబ్సిడీపై రుణాలను అందించి వారు ఉపాధి అవకాశాలను కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద ఇందిర మహిళా శక్తి పథకం ద్వారా రూ.10లక్షల రుణంతో మహిళా సంఘం సభ్యురాలకు మంజూరైన సంచార చేపల విక్రయ వాహనాన్ని ఎమ్మెల్యే పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా సంఘం సభ్యులు ఆర్థికంగా ఎదిగి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ రవికుమార్, ఏపీఎం శ్రీనివాసులు, స్థానిక నాయకులు అయ్యుబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి

వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

గద్వాల, జనవరి 4 : జిల్లా రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని గద్వాల కలెక్టర్ సంతోష్ అన్నారు. రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్‌నుంచి రోడ్ల భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్‌తో కలిసి రోడ్డు భద్రత వారోత్సవాల నిర్వహణపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించేదని దీని ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని నేడు రోడ్డు భద్రత మాసోత్సవం చేపడుతుందని అన్నారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించాలని, ప్రతి జిల్లా హెడ్‌క్వార్టర్‌లో భారీ ర్యాలీ చేపట్టాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాసురావు, రోడ్లు భవనాల శాఖ ఈఈ ప్రగతి, ఏపీడీ నర్సింహులు, రవాణా శాఖ, విద్యాశాఖ సహా అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి రజిని

వనపర్తి టౌన్, జనవరి 4 : వనపర్తి మండలంలోని చిట్యాల గ్రామంలో ఉన్న రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు న్యాయమూర్తి వి.రజిని హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు, రూ.3లక్షల ఆదాయం ఉన్న వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందుతుందన్నారు. త్వరితగతిన ఉచిత న్యాయ సహాయం పొందుటకు నల్సా టోల్‌ఫ్రీ నెంబర్ 15100కు కాల్ చేసి పొందవచ్చని, ఆన్‌లైన్‌లో అప్లికేషన్ పెట్టి న్యాయ సాయం పొందవచ్చన్నారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. మెరుగైన సమాజ నిర్మాణంలో విద్యార్థులు, యువత పాత్ర ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. లోక్ అదాలత్ న్యాయ సేవలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లీగల్ కౌన్సిల్ డేగల కృష్ణయ్య, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

ప్రతి పనిని రికార్డులో నమోదు చేయాలి

రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో యాదయ్య

పెద్దమందడి, జనవరి 4 : మండల పరిషత్ నుంచి నిర్వహిస్తున్న ప్రతి పనిని రికార్డులో నమోదు చేయాలని జెడ్పీ సీఈవో యాదయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ముందుగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నుంచి గ్రామాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను రికార్డుల్లో కచ్చితంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ప్రతి అధికారి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో సద్గుణ, ఎంపీవో పుష్ప, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాత్కాలిక సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

పెబ్బేరులో దీక్ష చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పెబ్బేరు, జనవరి 4 : మున్సిపాలిటీల్లో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరుతూ శనివారం పెబ్బేరు మున్సిపల్ కార్మికులు శనివారం ఒక రోజు దీక్ష చేపట్టారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్‌ఎంఆర్, ఫిక్స్‌డ్ పే తదితర పద్ధతుల్లో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ ఉద్యోగులుగా నియమించి, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో భగవంతు, రాముడు, గంగన్న, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

రియల్ ఎస్టేట్

★ ప్రజా రియల్ ఎస్టేట్ కల్వకుర్తి టౌన్‌లో ప్లాట్లు మరియు ఇండ్లు అమ్మదలచిన వారు, కొనదలచిన వారు సంప్రదించండి. సెల్: 9059211546.

NT-MBNR

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

విద్యుదాఘాతంతో మెకానిక్ మృతి

ధరూరు, జనవరి 4 : బోరు మోటారు తీస్తున్న క్రమంలో విద్యుదాఘాతంతో ఓ మోటరు మెకానిక్ మృతి చెందిన ఘటన మండలంలోని గ్రామంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు మండలంలోని దోర్నాల గ్రామానికి చెందిన బోయ పాలన్న(30) తండ్రి బోయ కిష్టన్న శనివారం మన్నాపురం సవారన్న అనే రైతు పొలంలో, మహీంద్ర ట్రాక్టర్‌కు సెట్ చేసుకున్న జాకీతో బోరు మోటరు తీయడానికి వెళ్లాడు. సాయంత్రం 4గంటల సమయంలో పొలం వద్ద బోరు మోటారు తీయడానికై జాకీ ఎత్తే క్రమంలో, పైన ఉన్న విద్యుత్ వైర్లు జాకీకి తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఇంట్లో చోరీ

గోపాల్‌పేట, జనవరి 4 : ఇంటి తాళం పగుల గొట్టి నగదు అపహరించిన ఘటన మండలంలోని బుద్ధారంలో చోటు చేసుకున్నది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం మేరకు గ్రామానికి చెందిన జూపల్లి నిరంజనమ్మ భర్త సత్యం ఇటీవల మృతి చెందగా కుమారుడు హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నాడు. నిరంజనమ్మ మాత్రం గ్రామంలో ఇంటి వద్ద ఉంటుంది. ఇదిలా ఉండగా, గత నెల 25న ఇంటికి తాళం వేసి కొడుకు వద్దకు హైదరాబాద్ వెళ్లింది. ఇదే అదునుగా తీసుకున్న గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం రాత్రి ఇంటి తాళం పడుల గొట్టి ఇంట్లోకి చొరబడి ఇంట్లో దాచుకున్న రూ.25వేలు అపహరించుకు వెళ్లాడు. అదే ఇంటిపై గదిలో అద్దె ఉంటున్న గ్రామానికి చెందిన వాజీద్ ఉదయం లేచి చూడగా, ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించి విషయం ఇంటి యజమాని నిరంజనమ్మకు ఫోన్ ద్వారా సమాచారం అందించి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

గోపాల్‌పేట, జనవరి 4 : ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగా యాలైన ఘటన మండలంలోని నర్సింగాయపల్లి వద్ద చోటు చేసుకున్నది. పోలీసుల కథనం మేరకు మండలంలోని తాడిపర్తికి చెందిన శేఖర్, చిట్యాలకు చెందిన మరో వ్యక్తితో కలిసి శనివారం బైక్‌పై వనపర్తి వెళ్తుండగా, వనపర్తి నుంచి గోపాల్‌పేట వైపు వస్తున్న ఆటో నర్సింగాయపల్లి వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొన్నది. ఈ ఘటనలో బైక్ పై వెళ్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వీరిని అంబులెన్స్‌లో వనపర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పాన్‌గల్, జనవరి 4 : మండల కేంద్రంలోని రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులపై విజిలెన్స్ అధికారుల దాడి

- 153క్వింటాళ్ల పీడీఎస్ రైస్ స్వాధీనం
- కేసు నమోదు

ఎర్రవల్లి చౌరస్తా, జనవరి 4 : ఎర్రవల్లి మండలంలోని పలు రైస్‌మిల్లులపై విజిలెన్స్ అధికారులు దాడులు జరిపారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఎర్రవల్లి మండలం దువాసిపల్లివద్ద అనుమానాదస్పదం గా ఆగి ఉన్న లారీని తనిఖీ చేసి 153 క్వింటాళ్ల పీడీఎస్‌ను స్వాధీనం చేసుకొని కోదండా పూర్ పోలీస్‌స్టేషన్ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశారు. శనివారం 153 క్వింటాళ్ల పీడీఎస్‌కు సంబంధించిన కర్నూల్ ప్రాంతానికి చెందిన బబుల్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వాతి తెలిపారు. అదేవిధుగా శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఎస్సై వెంకటేశ్ తమ సిబ్బందితో కలిసి కొండేరులో తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో కల్యాణ్‌కు చెందిన షాప్‌లో 6.50 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గన్నీ బ్యాగులు సరఫరా చేయాలి

- బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య

అయిజ రూరల్, జనవరి 4 : మండల పరిధిలోని చిన్నతాండ్రపాడు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద గన్నీ బ్యాగులు లేక రైతులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య పేర్కొన్నారు. శనివారం చిన్న తాండ్రపాడులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం కేంద్రం వద్ద నిల్వ ఉంచి చాలా రోజులు కావడంతో గన్నీ బ్యాగులు లేకపోవడంతో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో కొంత మంది రైతులు ప్రైవేటు వ్యక్తులకు ధాన్యం విక్రయిస్తున్నారని చెప్పారు. కొంత మంది రైతులకు టోకెన్లు అందజేసి కొనుగోలు చేయకపోవడంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. మాయ మాటలు చెప్పి గద్దె నెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా, బోనస్, రుణమాఫీ పూర్తిగా ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి రైతులకు గన్నీ బ్యాగులను సరఫరా చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మత్తాలి, రైతులు మల్లికార్జున్, సుధాకర్, వెంకటన్న, సురేశ్ పాల్గొన్నారు.

రైతు భరోసాను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

కొత్త కోట, జనవరి 4 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన రైతు భరోసా హామీని తక్షణమే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారెంటీ పథకాలను తక్షణమే అమలు పరచాలన్నారు. లేని చో రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. నల్ల చట్టాలను రద్దు చేయాలని, 2022లో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా కనీస గిట్టుబాటు ధర కల్పించేందుకు చట్టం చేస్తామని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాలన్ని అమలు చేయాలని ఆయన కోరారు. ఈనెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలో సీపీఎం పార్టీ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని, మహాసభల్లో ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఆంజనేయులు, గోపి, బాల్‌రెడ్డి, రాజు, నిక్సన్, వెంకట్రాములు, ఎస్.రాజు, పరమేశ్వరా చారి, ఆంజనేయులు, బాల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఎస్ కంపెనీపై విచారణ ప్రారంభం

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎదుట హాజరైన శ్రీధర్‌రెడ్డి

ఎర్రవల్లి చౌరస్తా, జనవరి 4 : మండలంలోని జింకలపల్లిలో గల ఎస్‌ఎస్‌ఎస్ కంపెనీపై విచారణ ప్రారంభమైంది. తొమ్మిది గ్రామాల ప్రజలు, పశుపక్షాదుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎస్‌ఎస్‌ఎస్ కంపెనీపై శనివారం హైదరాబాద్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు విచారణ ప్రారంభించింది. ఫిర్యాదు దారుడు ఇటిక్యాల ఉమ్మడి మండల బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్ రెడ్డి కంపెనీ యాజమాన్యం శనివారం హైదరాబాద్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు టాస్క్ ఫోర్స్ కమిటీ ఎదుట హాజరయ్యారు. ఇరువర్గాలు తమ వాదనలు బలంగా వినిపించారు. నిబంధనలకు విరుద్ధంగా విషరసాయనాలను వెదజల్లుతూ పర్యావరణానికి పెనుప్రమాదం సృష్టిస్తున్న కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న తాసీల్దార్

పెద్దమందడి, జనవరి 4 : మండలంలోని పామిరెడ్డిపల్లి గ్రామ శివారులో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించేందుకు కావాల్సిన స్థలాన్ని శనివారం తాసీల్దార్ సరస్వతి పరిశీలించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు సర్వే నెంబర్ 146లో ఉన్న స్థలాన్ని పరిశీలించినట్లు తాసీల్దార్ తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి పరిశీలించిన స్థల నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. త్వరలో సబ్ స్టేషన్ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ గణేశ్, అధికారులు పాల్గొన్నారు.